సాక్షి గుంటూరు

ఆదివారం । 3 । నవంబర్ । 2024



గ్రంథాలయం తనిఖీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బారతమ్మ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.



ప్రసన్నాంజనేయుని మాలధారణ

బెల్లంకొండ: స్థానిక కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి గుడిలో శనివారం భక్తులు పెద్ద ఎత్తున మాలధారణ చేపట్టారు. డిసెంబర్ 13న ఇరుముడి ఉంటుందని పేర్కొన్నారు.



బిక్ష ప్రారంభం

చిలకలూరిపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సుభానీనగర్‌లో ఉన్న హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం బిక్ష కార్యక్రమం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో కార్తిక సందడి



అమరావతి: అమరావతి క్షేత్రంలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తికమాసం ప్రారంభం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునుంచే అమరేశ్వరాలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు పవిత్ర కృష్ణానదిలో కార్తిక స్నానాలు చేసి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించి కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాల చాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు ఇబ్బందిపడకుండా క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. తాగునీరు, ఉచిత అన్నదానం, ప్రసాదం అందజేశారు. గతేడాది లాగానే గ్రామంలో, ఆలయంలో, స్నానఘాట్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ బందోబస్తు నిర్వహిస్తుంది. అమరావతి ప్రధానవీధిలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద భక్తులకు విద్యుత్ వెలుగులతో స్వాగత తోరణాలతోపాటు రోడ్డు కిరువైపులా విద్యుత్ తోరణాలను ఏర్పాటు చేసి దేవాలయానికి రాజగోపురానికి విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయటంతో ఆలయంగా శోభాయమానంగా ఉంది.

త్రికోటేశ్వరునికి విశేష అభిషేకాలు



నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక మాసం తొలిరోజున కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో భక్తుల తాకిడి నెలకొంది. అయ్యప్పమాలధారులు తొలిపూజలో పాల్గొన్నారు.

శివయ్య సన్నిధిలో హైకోర్టు జడ్జి



పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

రెండు, మూడు రోజుల్లో పామాయిల్ ప్యాకెట్లు

సాక్షి ఎఫెక్ట్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రాయితీపై వినియోగదారులకు అమ్మేందుకు జిల్లాకు రెండు,మూడు రోజుల్లో పామాయిల్ నూనె ప్యాకెట్లు వస్తాయని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి పి.కోమలిపద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షి దిన పత్రికలో శనివారం ప్రచురితమైన 'వంట నూనెలు సలసల' కథనానికి ఆమె స్పందించారు. సౌత్ ఇండియా కృష్ణ (కృష్ణపట్నం) నుంచి జిల్లాలో గుర్తించిన నలుగురు టోకు వ్యాపారస్తులకు పామాయిల్ నూనె ప్యాకెట్ల సరఫరాకు ఒప్పందం కుదిరిందని, వారి వద్ద నుంచి రెండుమూడురోజుల్లో నూనె ప్యాకెట్లు రాగానే రైతు బజార్లలో అమ్మకాలు పునఃప్రారంభిస్తామని వెల్లడించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



తెనాలిరూరల్: మండల పరిధిలోని కొలకలూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ప్రసాదం తిరుపతమ్మ(107) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమారులు. ఆమె కుమారుడు ప్రసాదం భాస్కరరావు కొలకలూరు గ్రామ మాజీ సర్పంచ్‌గా పనిచేశారు. మిగిలిన ఇరువురు కుమారులు వివిధ వ్యాపారాలలో ఉన్నారు. మనుమడు ప్రసాదం సురేష్ మొండిబండ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నాయకుడిగా ఉన్నారు. తిరుపతమ్మ భర్త మునలయ్య కూడా దాదాపు 98 సంవత్సరాలు జీవించి పదేళ్ల కిందట మృతి చెందారు. తిరుపతమ్మ మృతికి పలువురు మొండిబండ సంఘ నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు నివాళులర్పించారు. ఆమె అంత్యక్రియలు శనివారం సాయంత్రం ముగిశాయి.

మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి చిత్రంలో వజ్రబాబు, వేదికపై మురళీకృష్ణ, రజని, అంబటి, అయోధ్య, నూరిఫాతిమా, లేళ్ల అప్పిరెడ్డి, కావటి తదితరులు



వజ్ర సంకల్పం

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా బాల వజ్రబాబు ప్రమాణస్వీకారం
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి తరలివచ్చిన నేతలు
- ఆద్యంతం అట్టహాసంగా వేడుక
- పార్టీ బలోపేతానికి పునరంకితమవుదామని ప్రతిన

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్) : వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా నియమితులైన వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. నగరంలోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తరలి వచ్చారు. ముందుగా ఆటోనగర్ నుంచి భారీ ర్యాలీ నడుమ వేంకటేశ్వర విజ్ఞాన మందిరానికి చేరుకున్నారు. అనంతరం డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అధ్యక్షత వహించారు.

- రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని బలోపేతం చేసే దిశగా డైమాండ్‌బాబును నగర అధ్యక్షుడిగా నియమించడం సంతోషదాయకమన్నారు. నిబద్ధత, క్రమశిక్షణతో ఏ పని అప్పజెప్పినా సక్రమంగా నిర్వర్తించే సత్తా డైమాండ్‌బాబుకు ఉందన్నారు. అందరినీ కలుపుకుని పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. జెమిలి ఎన్నికలు తథ్యమని, 2027లోనే జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడడం ఖాయమన్నారు.
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాజకీయాల్లో ఒడుదొడుకులు సహజమని, ఓటమి తరువాత కలిసి కట్టుగా ముందుకు సాగకపోతే ఆ పార్టీ మనుగడే కష్టమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కూటమి నేతలు బ్రాందీ షాపులు ప్రారంభించకముందే ఎమ్మెల్యేలు కౌంటర్లు తెరిచారన్నారు. మహిళలపై దాడులు చేస్తే ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.
- మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయాన్ని బలోపేతం చేసే దిశగా పరిపాలన ముందుకు సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య రంగాన్ని సర్వనాశనం చేశారని మండి పడ్డారు. వైద్య రంగంలో జగనన్న ఎన్నో సంస్కరణలు తీసుకొస్తే ఆరోగ్యశ్రీ, విలేజ్ డాక్టర్‌తోపాటు, అనేక పథకాలను అటకెక్కించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు.
- ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా భుజాన ఎత్తుకున్న జెండాను దింపకుండా పాటుపడుతున్న ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామన్నారు. ఐదేళ్లపాలనలో పేదలకు మేలు చేసిన వై.ఎస్.జగన్ ప్రభుత్వంపై కూటమి నేతలు విషప్రచారం చేసి, అధికారంలోకి వచ్చారన్నారు. కూటమి నేతలు అసత్య ఆరోపణలు, దాడులు లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని, వారికి ఎదురొడ్డి పోరాడేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు.
- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఉరకలెత్తే ఉత్సాహంతో ముందుకు సాగి ప్రజల పక్షాన పోరాడాలని, కష్ట కాలంలో పార్టీకి, వై.ఎస్.జగనన్నకు వెన్నుదన్నుగా ప్రతి ఒక్కరం నిలబడదామని తెలిపారు.
- తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సగర్వంగా చెప్పుకునేలా జగనన్న ఐదేళ్ల పరిపాలన కొనసాగిందన్నారు. అసలు కూటమి నేతలు ఎలా గెలిచారో వారికి అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు.
- పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ కార్యకర్త స్థాయి నుంచి డిప్యూటీ మేయర్, పార్టీ నగర అధ్యక్షుడు స్థాయికి డైమాండ్‌బాబు ఎదిగారంటే వైఎస్సార్‌సీపీలో కార్యకర్తకు ఉండే ప్రాధాన్యం అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో గుంటూరు నరసరావుపేట పార్లమెంట్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీ నేతలు మండేపూడి పురుషోత్తమ్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎలికా శ్రీకాంత్ యాదవ్, మెట్టు వెంకటప్పారెడ్డి, అత్తోట జోసఫ్, కొత్తా చినపప్పరెడ్డి, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, నూనె ఉమామహేశ్వరరెడ్డి, పార్టీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కార్యకర్తలు బలంగా నిలబడడం శుభపరిణామం

ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓటమి తరువాత ఏ ఒక్క కార్యకర్త నిరుత్సాహం చెందకుండా ఉత్సాహంగా పార్టీ కోసం బలంగా నిలబడడం శుభ పరిణామమన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేలా ప్రతి కార్యకర్త సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి విద్య, వైద్యాన్ని ప్రతి పేదవాడి గడప వద్దకు చేర్చిన గొప్ప పరిపాలన చేసిన ఘనత వై.ఎస్.జగన్‌కే దక్కుతోందన్నారు. మహిళలకు కూటమి ప్రభుత్వంలో భద్రత లేకుండా పోయిందని, దాడులు, దౌర్జన్యాలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఇచ్చిన హామీలను గాలికొదిలేసి కేవలం ప్రతిపక్షాన్ని ఇబ్బంది పెట్టడమే దిశగా ముందుకు సాగుతున్నారని మండిపడ్డారు.

వైఎస్ జగన్ మాటే శిరోధార్యం

ప్రమాణ స్వీకారం చేసిన పార్టీ నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాటే శిరోధార్యంగా ముందుకు సాగుదామన్నారు. తనకు ఏ బాధ్యత అప్పచెప్పినా ఖచ్చితంగా చేస్తానని, తనను నగర అధ్యక్షుడిగా నియమించిన వై.ఎస్.జగన్‌కు, పదవి వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. తిరిగి వై.ఎస్.జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే దిశగా పాటుపడతామన్నారు.



నేతలను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

డైమండ్‌బాబుపై నమ్మకం ఉంది



ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో డైమండ్ బాబుకు వై.ఎస్.జగన్ సీటును కేటాయించడంతోపాటు, డెప్యూటీ మేయర్‌ను చేశారని తనపై ఉన్న నమ్మకం స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

కార్యకర్తలు కసిగా ఉన్నారు



తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాలు గెలిపించుకునే దిశగా నాయకులకంటే ముందు కార్యకర్తలే కసిగా పనిచేస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో డైమండ్ బాబు ఒక శాసనసభ్యుడిగా అసెంబ్లీలో అడుగు పెట్టాలని ఆకాంక్షించారు.

కొత్త ఉత్సాహం



నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నూతన ఉత్సాహంతో ముందుకు సాగుతోందన్నారు. 2027లోనే జెమిలి ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేశారు.

దుష్ట కూటమి

- అబలలు, చిన్నారులను బలిగొంటోంది
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజం
- గాయపడిన గుండెలకు వైఎస్సార్ సీపీ స్వాంతన
- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కదిలిన పార్టీ నేతలు
- దాడుల్లో మరణించిన బాలిక, యువతి కుటుంబాలకు ఆర్థిక సాయం
- పార్టీ తరఫున రూ.పది లక్షల చొప్పున చెక్కులు అందజేత

అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్ హాహాకారాలు చేస్తోంది. దుశ్శాసన పర్వం జూలు విదులుస్తోంది. కామాంధులు పేట్రేగిపోతున్నారు. అబలలను చెరబట్టి అఘాయిత్యాలకు తెగబడుతున్నారు. అకృత్యాల బలిపీఠంపై చిన్నారులు అసువులుబాస్తున్నారు. అరాచకాలపై కన్నెర్రచేయాల్సిన సర్కారు కీచకులతో కలిసి వికటట్టహాసం చేస్తోంది. దుష్టకూటమి దుర్నీతిరాజ్యంలో మగువ మౌనంగా రోధిస్తోంది. ఆమె ఆర్తనాదం అనంతవాయువుల్లో కలిసిపోతోంది. ఈ రాక్షస పాలనపై గళమెత్తిన వైఎస్సార్ సీపీ గాయపడిన గుండెలకు స్వాంతన కల్పించేందుకు నడుం కట్టింది. గుంటూరు జిల్లాలో హత్య, దాడి కేసుల్లో మరణించిన బాలిక, యువతి కుటుంబాలకు ఆపన్నహస్తం అందించింది. కర్కోటక ప్రభుత్వంపై గర్జించింది. అబలల తరఫున పోరుబావుటా ఎగరేసింది.



కొత్తరెడ్డిపాలెం దళితవాడలో శైలజ కుటుంబ సభ్యులకు సాయం అందించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: దుష్టకూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం దళితవాడలో హత్యకు గురైన శైలజ కుటుంబానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.10 లక్షల చెక్కును శనివారం అంబటి రాంబాబుతోపాటు పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అందజేశారు. ముందుగా శైలజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతురాలి తల్లిదండ్రులు ఇందిరమ్మ, దానియేలుకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శైలజను హత్య చేసిన నిందితుడు నాగరాజును ఇప్పటివరకు పోలీసులు అరెస్టు చేయలేకపోయారని అంబటి విమర్శించారు. తప్పుచేసిన వారికి వెంటనే శిక్ష పడితే నేరాలు పునరావృతం కావని పేర్కొన్నారు. ఇన్ని దారుణాలు జరిగినా ఈ ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ శైలజ హత్యకు గురై మూడు నెలలు దాటినా నిందితుడు నాగరాజును అరెస్టు చేయలేదని, పోలీసులు వెంటనే నిందితుడి ఆచూకీ గుర్తించాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం చెక్కును తమ ద్వారా అందజేశారని వివరించారు. కార్యక్రమంలో మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, పొన్నూరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.రూత్‌రాణి, వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొక్కిలగడ్డ కిరణ్, ఇంటూరి జయపాల్‌రెడ్డి, బి.విజయకుమార్, చందు సాంబశివరావు, పి.కోటేశ్వరరావు, జి.శ్రీరెడ్డి, కె.శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే అనారోగ్యంతో బాధపడుతున్న శలపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత, లిఫ్ట్ ఇరిగేషన్ మాజీ చైర్మన్ మన్నెం వేణుగోపాలరావును శనివారం అంబటి మురళీకృష్ణ పరామర్శించారు.

సహానా హత్య టీడీపీ నేతల పాపమే

తెనాలి: సహానా హత్య టీడీపీ నేతల పాపమేనని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. తెనాలిలో టీడీపీ రౌడీషీటర్ నవీన్ దాడిలో మరణించిన సహానా నివాసానికి శనివారం అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నేత నిమ్మకాయల రాజనారాయణతో కలిసి వచ్చారు. సహానా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థికసాయం చెక్కును సహానా తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడుతూ రౌడీషీటర్ నవీన్ దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో మృతిచెందిన సహానా భౌతికకాయాన్ని తమ పార్టీ అధినేత జగన్ సందర్శించి, కుటుంబసభ్యులను పరామర్శించినట్లు గుర్తుచేశారు. పార్టీ తరఫున ఆర్థికసాయాన్ని అప్పుడే ప్రకటించారని చెప్పారు. ఆ ప్రకారం ఇప్పుడు రూ.10 లక్షల చెక్కును అందజేశామన్నారు. సహానా కేసులో ఇంకా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ సహానా భౌతికకాయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించి రూ.10 లక్షల ఆర్థికసాయం ప్రకటించాకనే, ప్రభుత్వం స్పందించిందని గుర్తుచేశారు. అప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ కుటుంబాన్ని కనీసం పరామర్శించలేదని, సహానా అంత్యక్రియలకు ముందు హడావుడిగా వచ్చి ప్రభుత్వం తరఫున ఆర్థికసాయం చెక్కును అందజేసి వెళ్లారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు తెనాలిలో నాలుగు హత్యలు జరిగాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి పాల్గొన్నారు.

చిన్న కుటుంబంపై

అధికార మదం

- ఇంట్లోకి దీపావళి టపాసులు వేసి మహిళపై అసభ్య ప్రవర్తన, చిన్నారులపైనా దాడి
- ప్రశ్నించిన భర్తపై రుబాబు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వస్తుండగా మూకుమ్మడి దాడి
- తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని తీసుకెళ్లిన పోలీసులు
- ఏ హాని జరిగినా ప్రభుత్వానిదే బాధ్యతంటూ సోషల్ మీడియాలో విలపించిన భార్యాపిల్లలు



జరిగిన అన్యాయాన్ని విలపిస్తూ వివరిస్తున్న లక్ష్మి



ఆస్పత్రిలో నరేంద్ర

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అధికారాన్ని అడ్డుపెట్టుకుని గుంటూరు జిల్లాలో కూటమి నేతలు రెచ్చిపోయారు. దీపావళి రోజున చిరు కుటుంబానికి నరకం చూపారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు సోషల్ మీడియాలో బోరున విలపిస్తూ తమకు జరిగిన అన్యాయాన్ని వెళ్లబోసుకున్నారు. ఆ దృశ్యాలు అందరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. రెడ్డిపాలెం గ్రామం ఇన్నర్ రింగ్‌రోడ్డులో దీపావళి సందర్భంగా అవినాష్ అనే వ్యక్తి తన అపార్ట్‌మెంట్‌లో నుంచి ఎదురుగా నివసించే కంకర నరేంద్రరెడ్డి నివాసంపైకి దీపావళి టపాసులను విసిరాడు. ఇంటిముందు దీపావళి టపాసులను కాల్చుకుంటున్న నరేంద్రరెడ్డి కుమార్తె తనిష్క కాలుకు అది తగిలి పేలింది. కాలు కాలిన చిన్నారి వెంటనే ఇంట్లో ఉన్న తల్లి లక్ష్మికి చెప్పింది. దీంతో తల్లి లక్ష్మి అవినాష్ వద్దకు వెళ్లి చిన్నారులపై దీపావళి టపాసులు విసరడం ఏమిటని ప్రశ్నించింది. దీంతో అవినాష్ మద్యం మత్తులో ఉండి ఆమెను అసభ్య పదజాలంతో దూషించాడు. ఆమె కొడుకు రిషితేష్ రెడ్డిపై దాడిచేశాడు. దీంతో లక్ష్మి తన భర్త నరేంద్ర రెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పింది. వెంటనే ఇంటికి వచ్చిన నరేంద్రరెడ్డి అవినాష్‌ను నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై నరేంద్రరెడ్డి నల్లపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి తిరిగి ఇంటికి వస్తుండగా దారి కాచి పలువురు అతనిపై దాడి చేశారు. విషయం తెలిసిన నరేంద్రరెడ్డి భార్య కుటుంబ సభ్యులు నరేంద్ర రెడ్డిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికీ శాంతించని కూటమి నేతలు నరేంద్రరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని, అతను కనీసం చికిత్స కూడా తీసుకోకూడదని పోలీసులపై ఒత్తిడి చేశారని లక్ష్మి ఆరోపిస్తోంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన భర్త నరేంద్రరెడ్డిని నల్లపాడు పోలీసులు బలవంతంగా స్టేషన్‌కు తీసుకువెళ్లారని చెబుతోంది. అక్కడ అతనిని తీవ్రంగా కొట్టారని ఆరోపిస్తోంది. అధికారపార్టీకి చెందిన పలువురు నేతలు ఫోన్‌లు చేసి, మరికొందరు నేరుగా ఇంటి వద్దకే వచ్చి బెదిరింపులుకు దిగారని పేర్కొంటోంది. తమ కుటుంబానికి ఏదైనా హాని జరిగితే దానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆమె తన ఆవేదన వ్యక్తం చేసింది.

భర్త ఆచూకీ కోసం కోర్టును ఆశ్రయించిన లక్ష్మి

కూటమి ప్రభుత్వ నాయకులు, రౌడీలు మూకుమ్మడిగా దాడిచేశారని, తీవ్రగాయాలపాలైన తన భర్త నరేంద్రరెడ్డిని పోలీసులు ఆస్పత్రి నుంచి నిర్దాక్షిణ్యంగా తీసుకెళ్ళారని, తన భర్త ఆచూకీ తెలియటంలేదని లక్ష్మి కోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు సెర్చ్ వారంట్‌ను జారీ చేసినట్లు సమాచారం. కోర్టు ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన బృందం నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు నరేంద్రరెడ్డి ఆచూకీ కోసం వెళ్ళినట్లు సమాచారం.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,000** గరిష్ఠం : రూ. **3,800**

మోడల్ ధర రూ. **3,400**

క్లుప్తంగా

విజ్ఞాన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుస్తులు పంపిణీ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దాములూరు, చిలుకూరు గ్రామాల్లోని వరద బాధితులకు రూ.10 లక్షల విలువగల దుస్తుల కిట్లు పంపిణీ చేసినట్లు వీసీ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఇటీవల వరద ప్రాంతాల్లో ముంపునకు గురైన దాములూరు గ్రామంలోని 850 కుటుంబాలకు, చిలుకూరు గ్రామంలోని 400 కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. బాధితులకు అందజేసిన దుస్తుల కిట్‌లో చీర, పంచ, 2 టవళ్లు, దుప్పట్లు ఉంటాయని వివరించారు. పంపిణీలో 400 మంది ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.

150 మంది రౌడీషీటర్లపై ఎక్కువ కేసులు : ఎస్పీ



నగరంపాలెం(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఎక్కువ కేసులు నమోదైన 150 మంది రౌడీషీటర్లను ఎంపిక చేశామని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ చెప్పారు. వారిపై కోర్టు కేసుల విచారణను పూర్తి చేయించాక, పీడీ చట్టం ప్రయోగం లేదా నగర బహిష్కరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో శనివారం కోర్టు కానిస్టేబుళ్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులకు కఠినమైన శిక్షలు పడేలా కృషి చేయాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేందుకు రౌడీషీటర్లు భయపడిపోవాలని చెప్పారు. గంజాయి, అక్రమ మద్యం, ఎన్‌డీపీఎస్ కేసుల్లో ప్రతిఒక్కరికీ శిక్షలు ఖరారైతే, మరోసారి నేరాలు చేసేందుకు జంకుతారని పేర్కొన్నారు. కోర్టుల్లో ఫైల్ చేసిన కేసులకు ప్రాథమిక నమోదు (పీఆర్‌సీ) నంబర్లు కీలకమని, కోర్టులో కేసు చార్జిషీటు దాఖలు చేశాక సీసీ నంబర్లు వచ్చేలా చూడాలన్నారు. విచారణలో ఉన్న కేసులకు హాజరుకాని నిందితులకు నాన్ బెయిలబుల్ వారెంట్‌లు జారీ చేయించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలని స్పష్టంచేశారు. కోర్టు ఖర్చులను సైతం శాఖ తరుపున చెల్లిస్తామని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా లేదా అసాంఘిక శక్తులకు సహకరించినా తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో సీఐలు నరసింహారావు (డీసీఆర్‌బీ), శ్రీనివాసరావు (ఐటీ కోర్) పాల్గొన్నారు.

విద్యార్థులపై హాస్టల్ కమాటీ దాష్టీకం

- ఇద్దరు బాలలను విచక్షణారహితంగా రక్తమొచ్చేలా కొట్టిన వైనం
- ఒకరికి తలపై గాయాలు, మరొకరికి నడుముకు తీవ్ర గాయాలు
- కేకలు వేస్తూ బోరున విలపించిన చిన్నారులు



నడవలేని స్థితిలో ఉన్న మోహన్ ఆదిత్యను ఆస్పత్రికి భుజాలపై మోసుకెళుతున్న బంధువులు



తీవ్ర భయాందోళనతో వెక్కివెక్కి ఏడుస్తున్న విద్యార్థులు, తల్లి

ప్రత్తిపాడు: ఓ హాస్టల్ కమాటీ విచక్షణ మరిచాడు. కర్కశంగా ప్రవర్తిస్తూ విద్యార్థులపై పాశవికంగా దాడికి పాల్పడ్డాడు. విద్యార్థుల కాళ్లు పట్టుకుని నేలకేసి కొట్టి పైశాచికంగా ప్రవర్తించాడు. రక్తగాయాలతో భయాందోళనకు గురైన విద్యార్థులు పెద్ద పెద్దగా కేకలు వేస్తూ పరిగెత్తడంతో స్థానికులు గమనించి విద్యార్థులను కమాటీ దాడి నుంచి రక్షించి బయటకు తీసుకు వచ్చిన ఘటన పెదనందిపాడులో జరిగింది. పల్నాడు జిల్లా అమరావతికి చెందిన గోవిందు నాగార్జున, లక్ష్మీ అన్నపూర్ణ దంపతుల ఇద్దరు కుమారులు జి. జ్యోతి రాజేష్, మోహన్ ఆదిత్యలను పెదనందిపాడు ఎస్సీ బాలుర వసతి గృహంలో చేర్పించారు. అక్కడే ఉంటూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు బాలురు ఐదవ తరగతి చదువుకుంటున్నారు. దీపావళి సెలవులు కావడంతో ఇటీవల పిల్లలిద్దరూ ఇంటికివెళ్లారు. సెలవుల అనంతరం స్కూల్‌కు వెళ్లనని పిల్లలు మారాం చేయడంతో వారికి నచ్చజెప్పి శనివారం ఉదయం తల్లి అన్నపూర్ణ పిల్లలను తీసుకుని హైస్కూల్ వద్దకు వచ్చారు. ఆ సమయంలో అక్కడే ఉన్న హాస్టల్ కమాటీ షేక్ అబ్దుల్ వహాబ్‌కు ఇంటివద్ద జరిగిన విషయం చెప్పి, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరి ఇంటికి బయల్దేరారు.

విచక్షణారహితంగా..

ఇదే అదనుగా కమాటీ రెచ్చిపోయాడు. పాఠశాల ఆవరణలోనే విచక్షణారక్షితంగా విద్యార్థులపై దాడికి పాల్పడ్డాడు. జ్యోతిరాజేష్‌ను తలపట్టుకుని గోడకేసి కొట్టడంతో బాలుడి తలకు తీవ్ర రక్త గాయమైంది. భయాందోళనకు గురైన విద్యార్థి పరుగులు పెట్టాడు. మోహన్ ఆదిత్యనూ రెండు కాళ్లూ పట్టుకుని మెట్లుకేసి గట్టిగా కొట్టాడు. దీంతో అతని నడుముకు తీవ్ర గాయాలై నడవలేని, నిలబడలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులిద్దరూ పెద్ద పెద్దగా కేకలు వేశారు. గమనించిన స్థానికులు పిల్లలను అలా దారుణంగా ఎందుకు కొడుతున్నారని కమాటీని ప్రశ్నించడంతో అతని నుంచి సమాధానం కరువైంది. సమాచారం అందుకున్న తల్లి, కుటుంబ సభ్యులు వెనక్కు వచ్చి రక్తమోడుతున్న కుమారుడితోపాటు, నడవలేక నిస్సహాయ స్థితిలో ఉన్న కుమారుడిని చూసి నెత్తీనోరూ బాదుకుని కన్నీటి పర్యంతమయ్యారు. స్థానికులు చిన్నారులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. నడవలేని స్థితిలో ఉన్న విద్యార్థిని భుజాలపై ఎత్తుకుని బంధువులు ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు. సమాచారం అందుకున్న పెదనందిపాడు ఎస్ఐ మధుపవన్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కమాటీని అదుపులోకి తీసుకున్నారు. అయితే సంబంధిత శాఖ అధికారులు కమాటీని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

‘వివా’ విద్యార్థుల ఆవిష్కరణలు విజయవంతం



నంబూరు వీవీఐటీలో విద్యార్థులతో అతిథులు విశ్రాంత డీజీపీ మాలకొండయ్య, లావు నాగేశ్వరరావు, చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌లతో అధ్యాపకులు, విద్యార్థులు

పెదకాకాని: ఆలోచన, పరిజ్ఞానాన్ని పంచుకుంటూ సృజనాత్మకతకు సాంకేతిక మేళవింపుతో వివా విద్యార్థులు జర్మనీ విద్యార్థులతో కలసి రూపొందించిన నూతన ఆవిష్కరణలను వివా పాఠశాల వేదికగా శనివారం విజయవంతంగా ప్రదర్శించారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీలో మేక్‌థాన్ -2024లో భాగంగా జర్మనీకి చెందిన ఓం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బెర్నార్డ్ ఆధ్వర్యంలో వివా పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు, జర్మనీ న్యూరెంబర్గ్ నగరానికి చెందిన డ్యూరర్, మార్టిన్ బెహం పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు మూడు బృందాలుగా ఏర్పడి రూపొందించిన మూడు ఆవిష్కరణలు బ్లైండ్ స్టిక్ (కళ్లులేని వారిని రహదారులపై అప్రమత్తం చేసే చేతికర్ర), ఎకో మోషన్ షూస్, (పల్స్ పెడల్), నాడీ వేగాన్ని అదుపులో ఉంచే సైకిల్ పెడల్‌లను ముఖ్యఅతిథులు మాజీ డీజీపీ మాలకొండయ్య, ప్రముఖ పారిశ్రామికవేత్త లావు నాగేశ్వరరావు, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమక్షంలో ప్రదర్శించారు. మాజీ డీజీపీ మాలకొండయ్య మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆధారిత విద్య అనేది విద్యార్థులకు చాలా అవసరమన్నారు. దీని ద్వారా విద్యార్థులు వాస్తవిక ప్రపంచాన్ని అధ్యయనం చేయగలుగుతారన్నారు. మేక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులను, సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. లావు నాగేశ్వరరావు మాట్లడుతూ సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి మేక్‌థాన్‌లు ఉపయోగపడుతాయన్నారు.



నంబూరు వీవీఐటీలోఆవిష్కరణను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రొఫెసర్ డాక్టర్ బెర్నార్డ్ మాట్లాడుతూ ఒకే ప్రాంగణంలో కళాశాల, పాఠశాల ఉండటం ద్వారా ఈ మేక్‌థాన్‌లో సాంకేతిక అంశాలలో పరిష్కారాలను సులువుగా సాధించగలిగామన్నారు. గత 6 నెలలుగా విద్యార్థులు ఈ ఆవిష్కరణలకు కృషి చేస్తున్నారన్నారు. చివరిగా ప్రాజెక్ట్ విజయవంతం కావడం సంతోషం కలిగించిందని తెలిపారు. మూడు దశలలో జరిగిన ఈ మేక్‌థాన్‌లో మొదటి దశ అంతర్జాలం ద్వారా నిర్వహించగా ఈ దశలో విద్యార్థులు వారి ఆలోచనలను పంచుకొని మూడు ఆవిష్కరణలను ఎంచుకొన్నారని చెప్పారు. రెండవ దశలో వివా విద్యార్థులు జర్మనీలో నిర్వహించిన మేక్‌థాన్‌లో పాల్గొని ఆవిష్కరణల రూపకల్పనకు శ్రీకారం చుట్టారని, మూడవ దశలో భాగంగా జర్మన్ విద్యార్థులు వివా పాఠశాలలో నిర్వహించిన మేక్‌థాన్‌కు హాజరై విజయవంతంగా ఆవిష్కరణలను రూపొందించారని వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ చదలవాడ సరళ, డైరెక్టర్ ఎల్ కమాండర్ కెఎస్ రావు, ఉపాధ్యాయులు ఏకే మాధవి, వై.ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

తెనాలి: ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి అని, దీనిని కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు చెప్పారు. జిల్లాలోని వ్యవసాయ, ఉద్యానవన అధికారులకు ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ/అవగాహన కార్యక్రమాన్ని శనివారం కొల్లిపర మండలం అత్తోటలోని భూమిభారతి వద్ద నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం చాలా అవసరమని, రైతులందరూ దీనిపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజ కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వివరించారు. భూమి భారతి వ్యవస్థాపకులు యర్రు బాపయ్య తన ప్రకృతి వ్యవసాయ ప్రయాణాన్ని, అనుభవాలను అధికారులకు వివరించారు. తన పొలం లో పండిస్తున్న దేశీ వరి విత్తనాల గురించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి తెలియజేశారు. అనంతరం అధికారులందరికీ పొలాల్లోని ఏ-గ్రేడ్, ఎంటీఎం విధానం పొలం, నామని రోశయ్య సాగుచేస్తున్న మల్టీలేయర్ మోడల్ క్షేత్రాలను చూపించారు. ఆత్మ పీడీ వెంకటేశ్వర్లు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సునీత, ఉద్యానశాఖ అధికారిణి జానకి, తెనాలి, గుంటూరు, పొన్నూరు, మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు, జిల్లాలోని 17 మండలాల వ్యవసాయ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు, కేఎల్ విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్యార్థులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది హాజరయ్యారు. అనంతరం ప్రకృతి సేద్యం కోసం కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు.



నామని రోశయ్య మల్టీలేయర్ మోడల్ పొలంలో క్షేత్రసందర్శన

నేడు ‘యశస్వి’ వేణుగోపాలరావు అవార్డు ప్రదానోత్సవం

గుంటూరు వెస్ట్: ‘యశస్వి’ సత్రాజు శ్రీవేణుగోపాలరావు స్మారక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో నిర్వహిస్తామని సంస్కృతి సంస్థ వ్యవస్థాపకులు సత్రాజు బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయునిగా, కవిగా, గాయకునిగా విభిన్న పాత్రలను విజయవంతంగా నిర్వహించిన శ్రీవేణుగోపాలరావు ఎందరికో ఆదర్శనీయమన్నారు. ప్రస్తుతం ఆయన శిష్యులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా రుద్రవరం జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఉన్నం జ్యోతివాసు, కవి, గాయకుడు, గేయ రచయిత, తెలుగు పండితుడు ఖమ్మం జిల్లా గోళ్ళపాడు జెడ్పీహెచ్‌ఎస్ అసిస్టెంట్ మేడగాని శేషగిరిరావులకు సంగీత, సాహిత్య, నృత్య, నాటక సంస్థ సంస్కృతి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విశిష్ట అతిథులుగా కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, లేమల్లెపాడు ఎంటీఎస్ ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణతో పాటు అనేక మంది వక్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రవేశం ఉచితమని వివరించారు.

కృత్రిమ మేధస్సుపై పట్టు సాధించాలి



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేసిన ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు, శివరామప్రసాద్, ఎస్వీ రమణ, జూపూడి రంగరాజు, లక్ష్మీనారాయణ తదితరులు

ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: కృత్రిమ మేధస్సుపై విద్యార్థులు పట్టు సాధించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం ఎంబీఏ, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఎంకాం 2021-23, 2022-24 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ గంగాధరరావు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ప్రస్తుతం ప్రపంచాన్ని ఏలుతోందని, ప్రతి విద్యార్థి ఎంచుకున్న రంగంలో రాణించేందుకు ఏఐపై పట్టు సాధించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మేనేజ్‌మెంట్ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న విద్యాసంస్థల్లో హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రముఖమైనదని పేర్కొన్నారు. ఏఎన్‌యూ వాణిజ్యశాస్త్ర డీన్ ఆచార్య రామినేని శివరామప్రసాద్ మాట్లాడుతూ ఎంబీఏ అనేది ఒక కోర్సు కాదని, ఎన్నో విజ్ఞానశాఖలకు చెందినదని అన్నారు. దేశంలో మానవ వనరులకు ఉన్న డిమాండ్ మరే ఇతర దేశాల్లో లేదని, ఎంబీఏ చదువుతున్న విద్యార్థులందరూ మంచి మేనేజర్లుగా, ఔత్సాహిక పారిశ్రామివేత్తలుగా ఎదగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ అయిన ప్రతి విద్యార్థి తాను సమాజానికి ఏమి చేయగలనని ఆలోచించి, ముందడుగు వేసి, భవిష్యత్తుకు బాట నిర్మించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి బ్యాచ్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు కళాశాల తరపున బంగారు, రజత, కాంస్య పతకాలతోపాటు ఆచార్య రామినేని శివరామప్రసాద్ తమ తల్లిదండ్రులైన అచ్చాయమ్మ, కృష్ణయ్య చౌదరి పేర్లపై పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హిందూ కళాశాల అధ్యక్షుడు ఎస్వీఎస్ సోమయాజి, ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, హిందూ కాలేజీ-హైస్కూల్స్ కౌన్సిల్ అధ్యక్షుడు జి.శివరామకృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు, ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి ఎస్. మధుసూదనరావు పాల్గొన్నారు.

అండర్-17 బాలబాలికల వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

తెనాలి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ 68వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల అండర్-17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు శనివారం స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో ప్రారంభమయ్యాయి. విశ్రాంత ఎస్పీ సీహెచ్ చక్రపాణి, తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు పోటీలను ప్రారంభించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.నాగశిరీష వ్యవహరించారు. ఈ పోటీలు ఈనెల 4 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడల ప్రాధాన్యాన్ని అతిథులు వివరించారు. తెనాలి సీఐ రమేష్‌బాబు, ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బడేటి వెంకట్రామయ్య, జి.దేవి, బాపట్ల జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి షేక్ కరిముల్లా, హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, నందివెలుగు ప్రధానోపాధ్యాయిని జి.శివపార్వతి పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న చక్రపాణి, జనార్దనరావు